సాక్షి ఆదిలాబాద్

సోమవారం । 2 । జూన్ । 2025

ఉత్తమ 'సేవా' పతకాలు



రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందికి పతకాలు ప్రకటించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎంపికయ్యారు. 8లో▸



మొక్కజొన్న సాగుకు ఆసక్తి

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో మొక్కజొన్న సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. పెట్టుబడి తక్కువ దిగుబడి ఎక్కువగా ఉండడంతో మొగ్గు చూపుతున్నారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
35.0/27.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలుచోట్ల వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమశాతం పెరగనుంది.

న్యూస్‌రీల్

సన్నబియ్యం సద్వినియోగం చేసుకోవాలి



ఎంఎల్ఎస్ పాయింట్‌లో బియ్యం తరలింపుపై ఆరా తీస్తున్న డీటీ

కైలాస్‌నగర్: చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీ చేస్తున్న సన్నబియ్యాన్ని పేదలు సద్వినియోగం చేసుకోవాలని సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ నాయబ్ తహసీల్దార్ రాథోడ్ బాబుసింగ్ కోరారు. మూడు నెలల రేషన్ బియ్యం ఒకేసారి పంపిణీ ప్రారంభమైన నేపథ్యంలో పట్టణంలోని శాంతినగర్, రాంనగర్ కాలనీల్లోని పలు చౌకదుకాణాలను ఆదివారం ఆయన పరిశీలించారు. బియ్యం పంపిణీపై ఆరా తీశారు. కార్డుదారులు ఈపీవోఎస్ మిషన్‌పై మూడుసార్లు వేలిముద్రలు వేసి బియ్యం పొందాలని సూచించారు. డీలర్లు పొరపాట్లకు తావివ్వకుండా సకాలంలో పంపిణీ చేయాలని సూచించారు. అనంతరం ఎంఎల్ఎస్ పాయింట్‌ను సందర్శించి చౌకదుకాణాలకు బియ్యం తరలింపు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆదిలాబాద్ అర్బన్‌లో 43 షాపులకుగాను 38 షాపులకు, మావలలో 10 షాపులకు గాను ఒకటి, రూరల్‌లో 25 షాపులకు గాను 12 షాపులకు ఇంకా బియ్యం చేరాల్సి ఉందని తెలిపారు. సకాలంలో బియ్యం ఆయా దుకాణాలకు చేరవేసేలా చూడాలని ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జి మెస్రం మధుకర్‌ను ఆదేశించారు.

నేటి ప్రజావాణి రద్దు

కైలాస్‌నగర్: ప్రతి సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈ వారం రాష్ట్ర ఆవిర్భావ వేడుకల సందర్భంగా రద్దు చేసినట్లు కలెక్టర్ రాజర్షి షా ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలు విషయాన్ని గమనించాలని ఆయన సూచించారు.

రేపటి నుంచి ఇంటర్ ప్రయోగ పరీక్షలు

ఆదిలాబాద్‌టౌన్: ఇంటర్ ప్రయోగ పరీక్షల్లో ఫెయిల్ అయిన విద్యార్థులకు ఈనెల 3 నుంచి 6 వరకు సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించనున్నట్లు డీఐఈవో జాదవ్ గణేశ్ ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. సెకండియర్ జనరల్, ఒకేషనల్ విద్యార్థులు హాజరు కావాలని తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు ప్రాక్టికల్స్ ఉంటాయని వివరించారు.

నల్ల బ్యాడ్జీలతో లెక్చరర్ల నిరసన



డీఐఈవోకు వినతిపత్రం అందజేస్తూ..

ఆదిలాబాద్‌టౌన్: నూతనంగా రెగ్యులరైజ్ అయిన లెక్చరర్లకు 2వ ఇంక్రిమెంట్ నిలిపివేయడాన్ని నిరసిస్తూ ఆదివారం లెక్చరర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియెట్ స్పాట్ క్యాంప్‌లో డీఐఈఓ జాదవ్ గణేశ్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రెగ్యులరైజ్ అయిన లెక్చరర్లకు 2వ ఇంక్రిమెంట్ డీడీవోలు నిలుపుదల చేసినట్లు పేర్కొన్నారు. వెంటనే ఇంక్రిమెంట్లు మంజూరు చేయాలని పేర్కొన్నారు. ఇందులో లెక్చరర్ల సంఘం నాయకులు సంజీవ్ రెడ్డి, నరహరి, రత్నాకర్, సుజాత, సువర్ణ, నారాయణ రెడ్డి, రామారావు, సంతోష్, వినోద్, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కళాశాలలు పునఃప్రారంభం

ఆదిలాబాద్‌టౌన్: వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి కళాశాలలు పునఃప్రారంభం కానున్నాయి. ఇంటర్ ద్వితీయ సంవత్సరం, డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు మొదలవనున్నాయి. ఇన్నిరోజుల పాటు వేసవిలో ఆటాపాటలతో గడిపిన విద్యార్థులు మళ్లీ కళాశాల బాట పట్టనున్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు తరగతులు నిర్వహించనున్నట్లు డీఐఈవో జాదవ్ గణేశ్‌కుమార్, ఆయా డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లు పేర్కొన్నారు. విషయాన్ని విద్యార్థులు గమనించాలని వారు సూచించారు.

వేడుకలకు సర్వం సిద్ధం



కలెక్టరేట్ ఆవరణలో జెండా ఆవిష్కరణ కోసం పూర్తయిన ఏర్పాట్లు..

- రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవానికి ముస్తాబైన కలెక్టరేట్
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న షబ్బీర్ అలీ

కైలాస్‌నగర్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం నిర్వహించన్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. వేదికతో పాటు అమరవీరుల స్తూపాన్ని రంగులతో తీర్చిదిద్దారు. హాజరయ్యే వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రముఖులు కూర్చునేందుకు వీలుగా కుర్చీలను సిద్ధం చేశారు. ఉదయం 10గంటలకు నిర్వహించనున్న వేడుకలకు రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనార్టీ వెల్ఫేర్ ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. తొలుత పోలీసుల గౌరవ వందనం స్వీకరిస్తారు. అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించిన అనంతరం జాతీయ పతాకం ఆవిష్కరిస్తారు. జిల్లా ప్రగతిపై సందేశం ఇవ్వనున్నారు. వేడుకల నేపథ్యంలో కలెక్టరేట్, జెడ్పీ కార్యాలయంతో పాటు ప్రధాన చౌక్‌లను రంగురంగుల విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఎమ్మెల్యేలు, డీసీసీబీ చైర్మన్ తమతమ కార్యాలయాల్లో నిర్వహించే వేడుకల్లో పాల్గొని మువ్వన్నెల జెండా ఎగురవేయనున్నారు. కలెక్టరేట్‌లో చేపట్టిన ఏర్పాట్లను ఆర్డీవో వినోద్ కుమార్, అర్బన్ తహసీల్దార్ శ్రీనివాస్ పరిశీలించారు.



విద్యుద్దీపాలతో అలంకరించిన కలెక్టరేట్

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- డెంగీ జ్వరాలపై ప్రత్యేక దృష్టి
- అందుబాటులో హెల్ప్‌లైన్ నంబర్ 76709 04306
- పది ఆస్పత్రుల్లో బర్త్ వెయిటింగ్ రూమ్స్
- కరోనా ప్రబలకుండా చర్యలు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్

ఆదిలాబాద్‌టౌన్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది.. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి.. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి.. జిల్లాలో వర్షాల కారణంగా రాకపోకలకు ఇబ్బందులు ఎదురయ్యే 201 కటాఫ్ గ్రామాలను ఇప్పటికే గుర్తించాం.. గర్భిణులను ప్రసవాల కోసం వారం ముందుగానే బర్త్ వెయిటింగ్ రూమ్స్‌కు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం అని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి రాథోడ్ నరేందర్ అన్నారు. ఆదివారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పలు విషయాలు వెల్లడించారు.

సాక్షి: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?

డీఎంహెచ్‌వో: ఈ సీజన్‌లో నీటిజనిత, కీటకజనిత వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. ప్రతి ఒక్కరూ పరిసరాలతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలి. మలేరియా, డెంగీ, టైఫాయిడ్, వాంతులు, విరేచనాలు, వైరల్ జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో సంప్రదించాలి. వైద్య పరీక్షలు చేయించుకోవాలి. అలాగే వేడిచేసి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలి. ఇక ప్రతీ శుక్రవారం ఫ్రైడే.. డ్రైడే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. జూలై నుంచి సెప్టెంబర్ వరకు ర్యాపిడ్ ఫీవర్ సర్వే చేపడతాం.

సాక్షి: కొన్నిచోట్ల వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదనే విమర్శలున్నాయి.. దీనిపై ఏమంటారు..?

డీఎంహెచ్‌వో: ఇటీవల మెడికల్ ఆఫీసర్లు, సిబ్బందితో సమావేశం నిర్వహించాం. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా సమయపాలన పాటించాలని సూచించాం. పీహెచ్‌సీల్లో ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు అందుబాటులో ఉండి సేవలు అందించాలి. విధులు విస్మరించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించాం.

సాక్షి: జిల్లాలో ఏమైనా మందుల కొరత ఉందా..?

డీఎంహెచ్‌వో: అలాంటిది ఏం లేదు. సీజనల్ ముందస్తుగానే డ్రగ్ స్టోరేజీలో అవసరమైన మందులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాం. పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, అర్బన్‌హెల్త్ సెంటర్లకు సరిపడా అందజేస్తున్నాం. ఓఆర్ఎస్, జింక్, మెట్రోజిల్ మాత్రలు అందుబాటులో ఉన్నాయి.

సాక్షి: మాతా శిశు మరణాల నివారణ కోసం ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?

డీఎంహెచ్‌వో: మాతా శిశు మరణాలు అరికట్టేందుకు ప్రత్యేక దృష్టి సారించాం. గర్భిణులను ముందుగానే ఆస్పత్రులకు తరలిస్తున్నాం. జూన్ నుంచి ఆగస్టు వరకు జిల్లాలో 150 ప్రసవాలు జరగనున్నాయి. ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలు వారి ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని సమీక్షిస్తున్నారు. సుఖ ప్రసవం జరిగేలా చర్యలు చేపడుతున్నాం.

సాక్షి: పొరుగు రాష్ట్రాల్లో కరోనా కేసులు పెరుగుతున్నాయి. జిల్లాలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

డీఎంహెచ్‌వో: మహారాష్ట్రలో కేసులు నమోదవుతున్న క్రమంలో జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కోవిడ్ నిబంధనలు పాటించాలి. గతంలో మాదిరిగా కరోనా ప్రభావం ప్రస్తుతం లేదు. నిబంధనలు పాటిస్తే భయపడాల్సిన అవసరం లేదు.

సాక్షి: డెంగీ నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?

డీఎంహెచ్‌వో: జిల్లాలో గతేడాది 366 డెంగీ కేసులు నమోదయ్యాయి. వీటిలో 231 కేసులు అర్బన్ ఏరియాలోనివే. జిల్లావ్యాప్తంగా 165 డెంగీ రిస్క్ విలేజ్‌లను గుర్తించాం. ఈ గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు చేపడతాం. ఇప్పటికే ర్యాపిడ్ రెస్పాండ్ టీమ్‌ను ఏర్పాటు చేశాం. ఇందులో డీఎంహెచ్‌వో, అపిడాలమిస్ట్, మైక్రోబయాలజిస్ట్, హెల్త్ సూపర్‌వైజర్, డీఎంవో సభ్యులుగా ఉన్నారు.అలాగే డీఎంహెచ్‌వో కార్యాలయంలో 24 గంటల పాటు హెల్ప్‌లైన్ నంబర్ 7670904306ను అందుబాటులో ఉంచాం. ఏవైనా ఇబ్బందులు ఉంటే సంప్రదించాలి.

సాక్షి: వాగులు, వంకలు ఉప్పొంగే గ్రామాల్లోని గర్భిణులు, బాలింతల కోసం ప్రత్యేక చర్యలు ఏమైనా తీసుకుంటున్నారా..?

డీఎంహెచ్‌వో: వర్షాకాలంలో వాగులు, వంకలు ఉప్పొంగే గ్రామాలను ముందస్తుగానే గుర్తించాం. అలాంటివి జిల్లాలో 201 ఉన్నాయి. ఆయా చోట్ల మొత్తం పది బర్త్ వెయిటింగ్ రూమ్స్ ఏర్పాటు చేశాం. ఝరి, నార్నూర్, ఉట్నూర్, ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, ఇచ్చోడ, బజార్‌హత్నూర్, నేరడిగొండ, బోథ్, జిల్లా కేంద్రంలోని రిమ్స్‌లో ప్రసవ నిరీక్షణ కేంద్రాలను అందుబాటులో ఉంచాం. ప్రత్యేకంగా బెడ్లు వేయించాం. గర్భిణులతో పాటు అటెండెంట్‌కు కూడా భోజన సౌకర్యం ఉంటుంది.

ఇక 'భూభారతి' సందడి

- రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు
- ఈ నెల 29 వరకు నిర్వహణ
- మండలానికి రెండు ప్రత్యేక టీంలు
- భూసమస్యలపై దరఖాస్తుల స్వీకరణ

జిల్లాలోని మండలాలు : 20
మొత్తం గ్రామాలు : 473
నియమించిన ప్రత్యేక టీంలు : 40



పైలట్ మండలం భోరజ్‌లో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా (ఫైల్)

కైలాస్‌నగర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూభారతి నూతన రెవెన్యూ చట్టం -2025 అమలుకు సర్వం సిద్ధమైంది. జిల్లాలో పైలట్ మండలంగా భోరజ్‌ను ఎంపిక చేసిన ప్రభుత్వం అక్కడి అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతుల సమస్యలపై దరఖాస్తులు స్వీకరించింది. కాగా రాష్ట్ర అవతరణ దినోత్సవం పురస్కరించుకుని సోమవారం నుంచి ఈ చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని నిర్ణయించిన ప్రభుత్వం గ్రామసభల నిర్వహణకు ఆదేశించింది. దీంతో ఈ నెల 3 నుంచి 20 వరకు జిల్లాలోని అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సుల నిర్వహణకు యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. మండలాల వారీగా ప్రత్యేక టీంలను నియమించింది. ఈమేరకు షెడ్యూల్ ప్రకటించింది. సదస్సులో దరఖాస్తు ప్రతులను రైతులకు ఉచితంగా అందజేసి దాని ఆధారంగా సమస్యలపై అర్జీలు స్వీకరించనున్నారు. దీంతో 10 రోజుల పాటు గ్రామాల్లో సదస్సుల సందడి నెలకొననుంది.

మండలానికి రెండు టీంలు..

సదస్సుల నిర్వహణ కోసం మండలానికి రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో రోజు రెండు గ్రామాల్లో సదస్సులు నిర్వహించేలా ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ మేరకు తేదీలను ఖరారు చేసిన తహసీల్దార్లు ఇప్పటికే వాటిని ప్రకటించారు. తహసీల్దార్ ఆధ్వర్యంలో ఒక టీం, నాయబ్ తహసీల్దార్ ఆధ్వర్యంలో మరో టీంను నియమించారు. ఈ బృందాల్లో జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, గిర్దావర్లు, రికార్డు అసిస్టెంట్లు, మండల సర్వేయర్, డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించారు. వీరంతా ఎంపిక చేసిన గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు అందుబాటులో ఉండి రైతుల సమస్యలపై దరఖాస్తులు స్వీకరించనున్నారు. గత ధరణి పోర్టల్‌లో పరిష్కారం కాని సమస్యలను ప్రభుత్వం ఇప్పటికే గుర్తించింది. వాటి ఆధారంగా దరఖాస్తు ఫారాలను సిద్ధం చేసి జిల్లాకు పంపించింది. ఉచితంగా అందించే ఆ ఫారాలను రైతులు నింపి అధికారులకు అందజేయాల్సి ఉంటుంది.

రైతుల్లో చిగురిస్తున్న ఆశలు

జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఉండేలా గ్రామ పంచాయతీ, రైతువేదిక, కమ్యూనిటీ హాల్, ప్రభుత్వ పాఠశాల వంటి భవనాల్లో సదస్సులు నిర్వహించనున్నారు. గత ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్‌లో పరిష్కారం కాని సమస్యలన్నింటిపై రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఇలా స్వీకరించిన వాటిపై ఏ సమస్యపై ఎన్ని వచ్చాయనే వాటి వివరాలతో వేరు చేయనున్నారు. ఈ నివేదికను తహసీల్దార్లు ఏ రోజుకారోజు సదస్సు ముగిసిన అనంతరం కలెక్టర్‌కు అందించాల్సి ఉంటుంది. ఈ వివరాలను కలెక్టర్ సీసీఎల్‌కు పంపుతారు. అయితే భూభారతి చట్టం అమల్లో భాగంగా ప్రభుత్వం తహసీల్దార్లకు సిటిజన్ లాగిన్ అవకాశం కల్పించింది. దీంతో తమకు అందిన సమస్యల్లో తనస్థాయిలో పరిష్కరించే అవకాశమున్న వాటిని తహసీల్దార్లు సిటిజన్ లాగిన్‌లో అప్‌లోడ్ చేస్తారు. ఇలా అధికారులే క్షేత్రస్థాయికి వచ్చి దరఖాస్తులు స్వీకరిస్తుండటంతో సమస్యల పరిష్కారంపై రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.

సద్వినియోగం చేసుకోవాలి

భూసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఉద్దేశంతో ప్రభుత్వం భూభారతి చట్టాన్ని తీసుకొచ్చింది. ఇక ప్రతీ గ్రామంలో రెవెన్యూ సదస్సు ఉంటుంది. రైతుల సమస్యలు తెలుసుకునేందుకు అధికారులే నేరుగా గ్రామాలకు వస్తున్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి. తమ భూ సమస్యలతో కూడిన దరఖాస్తును వారికి అందజేయాలి.

– బి.వినోద్‌కుమార్, ఆర్డీవో, ఆదిలాబాద్

ఉల్లాస్‌తో అక్షర వెలుగు

ఉల్లాస్ ఉద్దేశం: 15 ఏళ్ల పైబడిన వారికి చదువు నేర్పించడం. (అక్షరాలను గుర్తించడం, చదవడం, రాయడం రావడం, కూడికలు చేయడం, కనీస సామర్థ్యాలు పెంపొందించడం)

- ఈనెల 15 నుంచి అమలు
- మహిళా సంఘాలు, స్వచ్ఛంద బోధకులతో..
- 15 ఏళ్లు పైబడిన వారికి చదువు

జిల్లా అక్షరాస్యత వివరాలు..

నిరక్షరాస్యులు	1,27,491
పురుషులు	44,635
మహిళలు	82,827
ఇతరులు	29
అక్షరాస్యత శాతం	63.29



చదువుకుంటున్న నిరక్షరాస్యులు (ఫైల్)

ఆదిలాబాద్‌టౌన్: అక్షర క్రమంలో ముందున్న ఆదిలాబాద్ జిల్లా అక్షరాస్యతలో మాత్రం వెనుకబడి ఉంది. రాష్ట్రస్థాయిలో 15వ స్థానంలో నిలిచింది. ఏ ప్రాంతమైనా అభివృద్ధి చెందాలంటే చదువుతోనే సాధ్యమనేది లోకవిదితం. గతంలో అక్షరాస్యత పెంచేందుకు వయోజన విద్య, చదువుల పండగ, సాక్షర భారత్ ద్వారా కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ అనుకున్న లక్ష్యాలు నెరవేర్చలేదు. మరోసారి కేంద్రం నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నవభారత్ సాక్షరత కార్యక్రమాన్ని చేపడుతోంది. 2026–27 వరకు అమలు చేయనుంది. జిల్లాలో అక్షరాస్యత శాతం 63.29 ఉండగా.. ఈ కార్యక్రమం ద్వారా పెంచేందుకు వయోజన విద్యాశాఖ చర్యలు చేపట్టింది. మహిళా సంఘాల ద్వారా అక్షరాస్యత పెంపొందించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు..

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు మహిళా సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, యువత తదితరులతో బోధన చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. అంగన్‌వాడీలు, మహిళా సంఘాలు, ఆర్‌పీల ద్వారా ఎంత మంది నిరక్షరాస్యులు ఉన్నారనేది 2009 జనాభా లెక్కల ప్రకారం గుర్తిస్తున్నారు. జిల్లాలో 554 గ్రామ సమైక్య, 18 మండల సమైక్య సంఘాలు ఉన్నాయి. 1,176 స్వయం సహాయక సంఘాలు ఉన్నాయి. ఇందులో 1,19,604 మంది సభ్యులు ఉన్నారు. అయితే ఈ సంఘాల్లో ఎంత మంది అక్షరాస్యులు ఉన్నారనే వివరాలు సేకరిస్తున్నారు. వారితో సంఘాల్లో ఉన్న నిరక్షరాస్యులకు బోధన చేయనున్నారు.

జూన్ 15 నుంచి అమలు..

ఉల్లాస్ కార్యక్రమాన్ని జూన్ 15 నుంచి ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ ద్వారా అమలు చేయనున్నారు. బోధన చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన వారితో నిరక్షరాస్యులకు చదువు చెప్పించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు. పాఠశాలలు, సామాజిక కేంద్రాలు, గ్రామపంచాయతీ కార్యాలయాలు, కమ్యూనిటీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రంథాలయాల్లో బోధన కొనసాగనుంది. ఇందుకు సంబంధించి ఎస్‌సీఈఆర్టీ వయోజన విద్యకు సంబంధించిన పుస్తకాలను రూపొందించింది. అయితే ఆన్‌లైన్ ద్వారా తెలుగుతో పాటు ఇతర భాషలను నేర్చుకునే అవకాశం సైతం ఉంది. అభ్యసనకు సంబంధించిన సామగ్రి, డిజిటల్ పరికరాలు, మౌలిక, సాంకేతిక సదుపాయాలు, లర్నింగ్ టూల్స్, అవగాహన కార్యక్రమాలు, అక్షరాస్యత మేళాలు, సామాజిక చైతన్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నారు. రోజుకు రెండు గంటల పాటు బోధన చేయనున్నారు. ఆరు నెలల పాటు కార్యక్రమం కొనసాగుతుంది. ఆ తర్వాత నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్‌స్కూల్ (ఎన్ఐఓఎస్) పరీక్ష నిర్వహిస్తారు. హాజరైన వారికి అక్షరాస్యులుగా సర్టిఫికెట్ అందజేయనున్నారు.

పకడ్బందీగా అమలు చేస్తాం..

నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రభుత్వం ఉల్లాస్ కార్యక్రమాన్ని చేపడుతుంది. ప్రస్తుతం నిరక్షరాస్యుల గుర్తింపు సర్వే నిర్వహిస్తున్నాం. జూన్ 15 నుంచి ఈ కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేసేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం. జిల్లాను అక్షరాస్యత శాతంలో ముందుంచేందుకు కృషి చేస్తున్నాం.

– శ్రీనివాస్‌రెడ్డి, వయోజన విద్య డీడీ, ఆదిలాబాద్

నకిలీ విత్తనాలపై ప్రత్యేక నిఘా

- వారం రోజుల్లో మూడు కేసులు, ఐదుగురి అరెస్ట్
- ఎస్పీ అఖిల్ మహాజన్



మాట్లాడుతున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లాలో నకిలీ విత్తనాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. తన కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వారం రోజుల్లో మూడు కేసులు నమోదు కాగా, ఐదుగురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 78 నకిలీ విత్తనాల ప్యాకెట్లు, పది కిలోల లూజ్ విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. రైతులు నకిలీ, లూజ్ విత్తనాలను కొనుగోలు చేయవద్దని సూచించారు. విత్తన ప్యాకెట్లపై సరైన లేబుల్, తయారీ, ఎక్స్‌పైరీ తేదీ ఉండేలా చూసుకోవాలని, ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే 8712659965 నంబర్‌లో సమాచారం అందించాలని తెలిపారు. సీసీఎస్ బృందం ఆధ్వర్యంలో పోలీసు టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇచ్చోడలో నలుగురు, బేలలో ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్లు వివరించారు. అలాగే శనివారం తలమడుగు మండలంలో ఒకరిని అరెస్టు చేసినట్లు తెలిపారు.

వడ్డీ వ్యాపారులపై కొరడా

- 11 మందిపై కేసు నమోదు
- ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి

ఆదిలాబాద్‌టౌన్: అధిక వడ్డీ వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 11 మండలాల్లో 20 బృందాలతో తనిఖీలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈమేరకు 11 కేసులు నమోదు చేసి పలువురిని అరెస్టు చేసినట్లు తెలిపారు. వడ్డీ వ్యాపారుల నుంచి ప్రామిసరీ నోట్లు, స్టాంప్ పేపర్లు, చెక్కులు, రిజిస్టర్లు, స్థలాల డాక్యుమెంట్లు వంటివి స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. ఆదిలాబాద్ వన్‌టౌన్, టూటౌన్, మావల, రూరల్, బోథ్, భీంపూర్, తాంసి, బేల, ఉట్నూర్, ఇంద్రవెల్లి,గుడిహత్నూర్ మండలాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు తెలిపారు. వడ్డీకి డబ్బులు ఇచ్చి వాటికి బదులుగా సేల్‌డీడీలను చేసుకోవడం, భూమిని తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేసుకోవడం చట్టరీత్యా నేరమన్నారు. ఆదిలాబాద్ వన్‌టౌన్ పరిధిలో నాలుగు కేసులు, టూటౌన్‌లో ఒకటి, మావల పోలీసు స్టేషన్ పరిధిలో రెండు, రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో రెండు, భీంపూర్‌లో ఒకటి, తాంసిలో ఒకటి చొప్పున కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు



బోల్తాపడిన ఆటో

చింతలమానెపల్లి(సిర్పూర్): మండలంలోని అడెపల్లి గ్రామ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. బాబాసాగర్ గ్రామం నుంచి ట్రాలీ వాహనం కాగజ్‌నగర్ వైపు వెళ్తుండగా, కాగజ్‌నగర్ నుంచి ముంజంపల్లి వైపు వెళ్తున్న ఆటో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆటో బోల్తా పడగా, ట్రాలీ వాహనం రోడ్డు కిందకు పడిపోయింది. ఆటో డ్రైవర్ దుబ్బుల అంజన్న తలకు గాయాలు కాగా, ట్రాలీ డ్రైవర్ దీపక్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అంజన్నను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. ఎస్సై ఇస్లావత్ నరేశ్ ఘటనా స్థలిని పరిశీలించి ప్రమాద వివరాలు తెలుసుకున్నారు.

నిజాయతీ చాటుకున్న ఆర్టీసీ ఉద్యోగులు



బ్యాగు అందిస్తున్న రాజశేఖర్, రమణ, గులామ్

ఆదిలాబాద్: ఆర్టీసీ ఉద్యోగులు నిజాయతీ చాటుకున్నారు. ఆదిలాబాద్ నుంచి నిర్మల్‌కు వెళ్లే బస్సులో శనివారం ప్రయాణించిన అక్రమ్ బేగం అందులోనే తన బ్యాగు మర్చిపోయింది. గుర్తించిన కండక్టర్ వి.రమణ, డ్రైవర్ ఎం. గులాబ్ ఆ బ్యాగును డిపో అసిస్టెంట్ మేనేజర్ రాజశేఖర్‌కు అప్పగించారు. వివరాలు తెలుసుకున్న డిపో అధికారులు సదరు మహిళకు ఆదివారం బ్యాగు అందించారు. అందులో 12 గ్రాముల బంగారం ఒక సెల్‌ఫోన్, రూ. వెయ్యి నగదు ఉన్నట్లు ప్రయాణికురాలు పేర్కొన్నారు. సిబ్బంది, యాజమాన్యానికి ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

గాజులపేటలో చోరీ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని గాజులపేట్‌లో గల ఓ ఇంట్లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గాజుల్‌పేట్‌లో గల తన ఇంటికి అబ్దుల్ కదిరి తాళం వేసి సమీపంలోని సోదరి ఇంట్లోకి వెళ్లి నిద్రించాడు. అర్ధరాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటితాళం పగులగొట్టి రూ.7వేల నగదు ఎత్తుకెళ్లారు. ఉదయం ఇంటికి వచ్చిన అబ్దుల్ కదిరి పగలగొట్టిన తాళాన్ని చూసి పోలీసులకు సమాచారం అందించాడు. సమీపంలోని పెట్రోల్ బంక్‌లో నిలిపి ఉన్న రెండు కొత్త వాహనాల బ్యాటరీలూ చోరీకి గురయ్యాయి.

యువకుడి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన 21ఏళ్ల కాంబ్లే సాయిప్రశాంత్ అదృశ్యమైనట్లు టూటౌన్ సీఐ కరుణాకర్ రావు తెలిపారు. తల్లిదండ్రులు చనిపోవడంతో మేనమామ ఇంట్లో ఉంటున్నాడు. శనివారం ఉదయం 11 గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు తిరిగి రాకపోవడంతో చుట్టుపక్కల గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ప్రకృతి సోయగం..



చెట్టు కొమ్మల మధ్యన సూర్యుడి ప్రకాశం



గడ్డి తింటున్న చుక్కల దుప్పులు

ప్రకృతిలో ఎన్నో అందాలు దాగిఉన్నాయి. వాటిని చూసినప్పుడు మనసుకు ఎంతో హాయిగా ఉంటుంది. అలాంటి దృశ్యాలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అడవుల్లో ప్రకృతి ప్రేమికులకు కనువిందు చేస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు అడవి, మైదానాలు పచ్చదనం సంతరించుకున్నాయి. జన్నారం అటవీ డివిజన్ ఇందన్‌పల్లి రేంజ్ పరిధిలోని ఘనిషెట్టి కుంట సమీపంలో చుక్కల దుప్పులు ఇలా లేతగడ్డి తింటూ అటుగా వెళ్లేవారిని ఆకర్షిస్తున్నాయి. వీటిని రేంజ్ అధికారి కారం శ్రీనివాస్ కెమెరాలో బంధించారు. ఇక జన్నారం మండల కేంద్రంలో వాగుపై వంతెన సమీపంలోని చెట్టు కొమ్మల చాటు నుంచి సాయం సంధ్యాసమయం భానుడు తొంగి చూస్తున్న దృశ్యం ప్రకృతి రమణీయతకు అద్దం పడుతోంది. – జన్నారం



పచ్చని మైదానంలో మేకలు..

మత్తు వదలరా..!

- జిల్లాలో యథేచ్ఛగా గంజాయి విక్రయం, వినియోగం
- వాట్సాప్‌లో అమ్మకం, అడ్డాలు, సమయంపై సమాచారం
- నియంత్రణకు ట్రాకింగ్ డాగ్స్ వినియోగం



ఈ ఏడాది ఫిబ్రవరి 20న జిల్లా కేంద్రంలో గంజాయి ముఠా అరెస్టు చూపుతున్న పోలీసులు

మంచిర్యాలక్రైం: జిల్లాలో గంజాయి దందాపై పోలీసు యంత్రాంగం కఠిన చర్యలు చేపడుతున్నప్పటికీ, ఈ చీకటి వ్యాపారం తగ్గడం లేదు. గంజాయి మత్తులో యువత దాడులకు తెగబడటం, బెదిరింపులతో డబ్బులు లాక్కోవడం సమాజంలో ఆందోళన కలిగిస్తోంది. రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బాధ్యతలు చేపట్టిన తర్వాత, జిల్లాను గంజాయి రహితంగా మార్చడంపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. అయినా క్షేత్రస్థాయిలో ఈ దందా యథేచ్ఛగా సాగుతోంది. చిన్న ప్యాకెట్లలో గంజాయి రవాణా, విక్రయాలను గుర్తించడం పోలీసులకు పెద్ద సవాలుగా మారింది.

యువతే లక్ష్యంగా వ్యాపారం..

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ విద్యార్థులను గంజాయి స్మగ్లర్లు టార్గెట్ చేస్తున్నారు. ఉన్నత చదువులు చదివే యువత నుంచి రోడ్లపై తిరిగే యువకుల వరకు గంజాయికి బానిసలవుతున్నారు. గంజాయి సేవనంతో కలిగే ఆరోగ్య సమస్యలపై పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సామాజిక బాధ్యతగా, మత్తులో ఉన్న యువతను సన్మార్గంలోకి తీసుకొచ్చేందుకు వివిధ చర్యలు చేపడుతున్నారు.

సోషల్ మీడియా వేదిక..

సోషల్ మీడియా, ముఖ్యంగా వాట్సాప్ గంజాయి అమ్మకాలకు అడ్డాగా మారింది. గంజాయి సేవించే వారు వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటు చేసుకుని, కోడ్ భాషలో సమాచారం పంపుతూ అమ్మకాలు కొనసాగిస్తున్నారు. 100 గ్రాముల ప్యాకెట్లను రూ.200 నుంచి రూ.300కి విక్రయిస్తూ, రాత్రి 7 నుంచి 9 గంటల మధ్య నిర్దిష్ట ప్రాంతాల్లో డెలివరీ చేస్తున్నారు. శ్రీరాంపూర్ రింగ్ రోడ్, రైల్వే స్టేషన్, కాలేజీ రోడ్, రాజీవ్ నగర్, ఎన్టీఆర్ నగర్, జాఫర్ నగర్, అండలమ్మ కాలనీ, తిలక్‌నగర్, బైపాస్ రోడ్ వంటి ప్రాంతాలు గంజాయి అమ్మకాలకు అడ్డాలుగా మారాయి. గతంలో గంజాయి వాడకం మాస్ ఏరియాలకు పరిమితమైనప్పటికీ, ఇప్పుడు క్లాస్ ఏరియాల్లోనూ జోరుగా సాగుతోంది.

సిగరెట్లలో గంజాయి..

పట్టణ కేంద్రాల్లోని పాన్ షాపులు, టీ స్టాల్స్ వద్ద గంజాయిని సిగరెట్లలో దాచి రహస్యంగా విక్రయిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలోని ఓ టీ స్టాల్ గంజాయి సిగరెట్ల విక్రయ కేంద్రంగా మారిందని ఆరోపణలు ఉన్నాయి. రోజూ వందల మంది యువత ఇక్కడికి వచ్చి, కోడ్ భాషలో గంజాయి సిగరెట్లను కొనుగోలు చేస్తున్నారు.

పెరుగుతున్న బానిసలు..

పోలీసు లెక్కల ప్రకారం, జిల్లాలో గంజాయి వాడకం గణనీయంగా పెరిగింది. గతంలో పట్టణ ప్రాంతాలకే పరిమితమైన గంజాయి వాడకం ఇప్పుడు గ్రామీణ ప్రాంతాలకు విస్తరించింది. గంజాయి వ్యసనం యువతను సామాజిక, ఆరోగ్య సమస్యల వైపు నడిపిస్తోంది. పోలీసులు ఈ వ్యసనాన్ని అరికట్టేందుకు కఠిన చర్యలతో పాటు, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పటికీ, గంజాయి దందా పూర్తిగా నియంత్రణలోకి రావడం లేదు.

ట్రాకింగ్ డాగ్స్‌తో తనిఖీలు

గంజాయి వాసన పసిగట్టే ట్రాకింగ్ డాగ్స్ సాయంతో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. పాత నేరస్తుల ఇళ్లు, పాన్ షాపుల్లో రాత్రిపగలు తేడా లేకుండా తనిఖీలు చేస్తున్నారు. అయినా, కచ్చితమైన సమాచారం లేనప్పుడు గంజాయి విక్రయాలను నియంత్రించడం కష్టంగా మారుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి మే 20 వరకు 30 కేసులు నమోదు కావడం, 95 మంది నిందితులను అరెస్ట్ చేయడం జిల్లాలో దందా ఏరీతిని సాగుతోందో అర్థం చేసుకోవచ్చు. ఫిబ్రవరిలో సీసీ కెమెరాల వ్యాపారం ముసుగులో గంజాయి దందా నడిపిన 22 మంది ముఠాను పట్టుకుని, 23.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. మొత్తంగా, రూ.10.37 లక్షల విలువైన 34 కిలోల గంజాయిని ఈ ఏడాది స్వాధీనం చేసుకున్నారు.

రంగంలోకి ట్రాకింగ్ డాగ్స్..



గంజాయి విక్రయాలు, రవాణాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. పోలీస్ శాఖ గంజాయి నియంత్రణకు నార్కోటిక్ టీమ్‌లను ఏర్పాటు చేసింది. స్పెషల్‌గా గంజాయి నియంత్రణకు ప్రత్యేక శిక్షణ తీసుకున్న ట్రాకింగ్ డాగ్స్‌ను వినియోగిస్తున్నాం. జిల్లాకు అధికంగా మహారాష్ట్ర నుంచి వస్తుంది. సరిహద్దు ప్రాంతాల్లో చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా పోలీసులకు గంజాయి సమాచారం అందించి నియంత్రణకు కృషి చేయాలి. యువతను పెడదోవ పట్టకుండా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం.
– ఎగ్గడి భాస్కర్, డీసీపీ మంచిర్యాల

వర్షాకాలం.. పశువులు పైలం

చెన్నూర్‌రూరల్/లక్ష్మణచాంద: వర్షాకాలం ఆరంభమైంది. ఈసారి ముందస్తుగానే వర్షాలు కురుస్తున్నాయి. దీంతో వ్యవసాయ పనులు కూడా మొదలయ్యాయి. మరోవైపు అకాల వర్షాలకు నేల కూడా పచ్చబడింది. లేదగడ్డి పశువులను ఆకర్షిస్తోంది. ఈ నేపథ్యంలో, పశువులకు అంటు వ్యాధులు త్వరగా సోకే అవకాశం ఉందని కత్తెరసాల, లక్ష్మణచాంద పశువైద్యాధికారి సతీశ్, ఓంప్రకాశ్ సూచించారు. పశుపోషకులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. వర్షాకాలంలో గొర్రెలు, మేకలకు సంబంధించిన సాధారణ వ్యాధులు, వాటి లక్షణాలు, నివారణ, చికిత్స విధానాలు వెల్లడించారు.



డా.ఓంప్రకాశ్, పశువైద్యాధికారి



సతీశ్, పశువైద్యాధికారి, కత్తెరసాల



మేతకు వెళ్తున్న గొర్రెలు

గాలిపుండు (ఫుట్‌రాట్)

వ్యాధి లక్షణాలు: వర్షాకాలంలో చిత్తడి నేలలపై తిరిగే మేకలు, గొర్రెలకు గాలిపుండు వ్యాధి సోకే అవకాశం ఎక్కువ. ఈ బ్యాక్టీరియల్ వ్యాధి వల్ల గొర్రెలు కుంటుతూ, మూడు కాళ్లపై గెంటుతాయి. గిట్టల మధ్య ఎర్రగా కందిపోయి, చీము పట్టి నల్లగా మారుతుంది. తీవ్రమైతే గిట్టలు ఊడిపోయే ప్రమాదం ఉంది.

నివారణ చర్యలు

వ్యాధి సోకిన పశువులను వెంటనే గుర్తించి, ఆరోగ్యవంతమైన వాటికి దూరంగా ఉంచాలి.
చిత్తడి నేలలు, నీరు నిలిచే ప్రాంతాల నుంచి పశువులను దూరంగా ఉంచాలి. వర్షం నుంచి రక్షణ కల్పించే ఆరు ప్రాంతాల్లో పశువులను ఉంచాలి.
చికిత్స తర్వాత నయమైన పశువులను మాత్రమే ఆరోగ్యవంతమైన వాటితో కలపాలి.

చికిత్స విధానం

వైద్యుని సలహాతో పెన్సిలిన్, నొప్పి నివారణ మందులు వాడాలి. వ్యాధి సోకిన గిట్టలను 10% ఫార్మలిన్ లేదా కాపర్‌సల్ఫేట్ ద్రావణంలో ముంచాలి.

నీలి నాలుక వ్యాధి (బ్లూ టంగ్ డిసీజ్)

వ్యాధి లక్షణాలు: నీలి నాలుక వ్యాధి, వైరస్ వల్ల సంక్రమించే ఈ వ్యాధి దోమల ద్వారా వ్యాపిస్తుంది. వర్షాకాలంలో ఈవ్యాధి విస్తరణ అవకాశం ఎక్కువ.

లక్షణాలు: అధిక జ్వరం, చొంగ కారడం, పెదవులు, చిగుళ్లు వాచడం, ఎర్రటి గుల్లలు ఏర్పడడం.
తీవ్ర సందర్భాల్లో గిట్టలు వాచి, నాలుక నీలం రంగులోకి మారుతుంది.
పశువులు నడవలేక, మేత మేయక, అచేతన స్థితికి చేరి కిందపడిపోతాయి.

నివారణ చర్యలు: ఈగలు, దోమల నివారణకు రోజుకు రెండుసార్లు వేప ఆకులతో పొగ వేయాలి. బురద, నీరు నిలిచే ప్రాంతాలను శుభ్రం చేయాలి.

చికిత్స విధానం

పశువైద్యుడిని సంప్రదించి, యాంటీబయోటిక్, నొప్పి నివారణ మందులు వాడాలి.
నోటి పుండ్లను పొటాషియం పర్మాంగనేట్ ద్రావణంతో కడిగి, జింక్ పౌడర్ రాయాలి.
గిట్టల పుండ్లకు హిమాక్స్, లేమనెంట్ వంటి ఆయింట్‌మెంట్‌లు వాడాలి.

చిటుకు వ్యాధి..

తొలకరి గడ్డిలో క్లాస్ట్రీడియం పర్ ఫ్రింజెర్స్ టైప్–డి అనే రకం సూక్ష్మజీవులు ఉంటాయి.ఈ సూక్ష్మ జీవులు గాలి లేని వాతావరణంలో ఎక్కువగా వృద్ధి చెందుతాయి. తొలకరి పిచ్చి గడ్డిని జీవాలు తిన్నప్పుడు జీవాల పేగుల్లో గాలి లేని వాతావరణం ఏర్పడి అక్కడ సూక్ష్మజీవుల వల్ల ఏర్పడిన విష పదార్థాల వల్ల ఈ చిటుకు వ్యాధి వస్తుంది.

వ్యాధి లక్షణాలు:

వ్యాధి సోకిన గొర్రెలు కొన్నిసార్లు ఎటువంటి లక్షణాలు లేకుండానే ఆకస్మికంగా మరణిస్తాయి. కొన్ని ఎగిరి కిందపడి కాళ్లు కిందకు కొట్టుకుంటూ, పళ్లు కొరుకుతూ చనిపోతాయి. వ్యాధి సోకిన గొర్రెలు చొంగ కారుస్తాయి. శ్వాస అధికంగా ఉంటుంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు...

చికిత్స కంటే నివారణ ముఖ్యం. మే నుంచి జూలై వరకు వ్యాధినిరోధక టీకా(మల్టీ కాంపోనెంట్ ఈటీ వ్యాక్సిన్) వేయించాలి. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలో పశు వైద్యాధికారికి తెలియ చేసి చికిత్స చేయించాలి. తొలకరి చినుకులకు మొలిచిన గడ్డి మేయకుండా చూసుకోవాలి. వ్యాధి సోకిన జీవాలను మంద నుంచి వేరు చేయాలి.

లెదర్ పార్క్ జేఏసీ ఏర్పాటు



జేఏసీ కమిటీ సభ్యులు

మందమర్రిరూరల్: లెదర్ పార్క్ సాధన సమితి ఆధ్వర్యంలో మందమర్రి, మంచిర్యాల లెదర్ ఇండస్ట్రియల్ పార్క్ జేఏసీ కమిటీలను మందమర్రి పట్టణంలోని సింగరేణి హైస్కూల్ మైదానంలో ఆదివారం ఎన్నుకున్నారు. మందమర్రి పట్టణ జేఏసీ కన్వీనర్‌గా నెరువెట్ల శ్రీనివాస్, కోకన్వీనర్‌గా మంతె సుమన్, ముల్కల్ల రమేశ్, రామకృష్ణ, నందిపేట రాజు, నెరువెట్ల సుజిత్, గడ్డం అనిల్, కొలుగూరి పృథ్వీరాజ్, బత్తుల సరిత, బొడ్డు వినోద, సకినాల సాయికృష్ణ, ఎంవీ.గుణ, కాసిపేట స్వామి, తోకల నిరోష, గౌరవాధ్యక్షులుగా ఉప్పులేటి నరేశ్ ఎన్నికయ్యారు. మంచిర్యాల జిల్లా గౌరవ అధ్యక్షులుగా పుల్లూరి లక్ష్మణ్, కన్వీనర్‌గా చిప్పకుర్తి ఐలయ్య, కోకన్వీనర్లుగా జంగంపల్లి రామస్వామి, పల్లె సమ్మయ్య, నందిపేట రవి, దరిపెల్లి కనుకయ్య, సిర్ర దివాకర్, నేరెల్ల శంకరయ్య, ఎలుకలపల్లి మల్లేశ్, సుద్దాల జనార్దన్, ఆసంపల్లి రాయమల్లు, బచ్చలి నరసయ్య, వేల్పుల కిరణ్, చిలుముల కుమార్, మామిడిపల్లి ప్రకాశ్, కొంకటి శ్రీనివాస్, కాసిపేట స్వామి ఎన్నికయ్యారు.

సత్యపాల్‌రావుకే ఐఎన్‌టీయూసీ మద్దతు

కాసిపేట: కాసిపేట మండలం దేవాపూర్ సిమెంట్ కంపెనీలో జరగనున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో సత్యపాల్‌రావుకే ఐఎన్‌టీయూసీ మద్దతు ప్రకటించింది. ఈమేరకు రాష్ట్ర కనీస వేతనాల బోర్డు చైర్మన్, ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ తెలిపారు. ఓరియంట్ సిమెంట్ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ మొదటి నుంచి ఐఎన్‌టీయూసీకి అనుబంధంగా ఉందని పేర్కొన్నారు. సత్యపాల్‌రావు తండ్రి రఘుపతిరావు ఐఎన్‌టీయూసీ మద్దతుతో ఇదే పలుమార్లు పోటీచేసి గెలిచారని గుర్తు చేశారు. ప్రస్తుతం కొందరు ఎమ్మెల్యేలు మద్దతు తెలుపుతున్న యూనియన్, అభ్యర్థికి ఐఎన్‌టీయూసీతో సంబంధం లేదని స్పష్టం చేశారు. ఐఎన్‌టీయూసీ కార్మికులకు అండగా ఉంటుందని తెలిపారు. సత్యపాల్‌రావును గెలిపించాలని కోరారు.

దేవాపూర్‌లో మోటర్ సైకిల్ ర్యాలీ

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో సత్యపాల్ రావుకు మద్దతుగా నాయకులు, కార్మికులు మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆదివాసీ గ్రామ పటేళ్లు, ఆదివాసీ సంఘాల నాయకులు, తెలంగాణ ఓరియంట్ స్టాఫ్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు సతీష్‌రెడ్డి, ఓరియంట్ సిమెంట్ కంపెనీ కార్మిక నాయకులు రమణారెడ్డి మద్దతు తెలిపి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

శాస్త్రీయ పద్ధతిలో సర్దుబాటు చేయాలి

- టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల లచ్చిరాం

ఆదిలాబాద్‌టౌన్: ఉపాధ్యాయుల సర్దుబాటును శాస్త్రీయ పద్ధతిలో చేయాలని టీయూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల లచ్చిరాం డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో ఆదివారం యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 60 మంది విద్యార్థులకు ఇద్దరే ఎస్జీటీలను నియమించడం సరికాదన్నారు. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి 1:20కి తగ్గించాలన్నారు. ప్రాథమిక పాఠశాలల్లో ఐదుగురు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలని పేర్కొన్నారు. బడిబాట సాగుతున్న సమయంలో సర్దుబాటు చేయడం సరికాదని తెలిపారు. ఇటీవల ఉద్యోగ విరమణతో చాలా పోస్టులు ఖాళీ అయ్యాయని తెలిపారు. విద్యా సంవత్సరానికి ముందే పదోన్నతులు కల్పిస్తే ప్రభుత్వ విద్య బలోపేతం అవుతుందన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని పేర్కొన్నారు. అనంతరం ఇటీవల ఉద్యోగ విరమణ పొందిన భూపతిరెడ్డి, కిరణ్ బాల ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. సమావేశంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలంధర్‌రెడ్డి, సంఘ బాధ్యులు ఆర్.సుజాత, గంద్రత్ నారాయణ, రామారావు, రమేశ్, దేవన్న, ఆదిలాబాద్ అర్బన్ ఎంఈవో సోమయ్య, శ్రీహరి, రమేష్, పండరీనాథ్, ప్రఫుల్‌చందర్, ఉపాధ్యాయులు యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆవుదూడను చంపిన కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి



నిందితుడు ఉపయోగించిన కత్తి

ఆదిలాబాద్‌టౌన్: ఆవుదూడను చంపిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి తెలిపారు. డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. భోరజ్ మండలం సిర్సన్న గ్రామానికి చెందిన సాయి కుమార్‌కు చెందిన ఆవుదూడను అదే గ్రామానికి చెందిన రాథోడ్ సంజయ్ గిమ్మ శివారులో కత్తితో పొడిచాడు. జైనథ్ సీఐ సాయినాథ్, ఎస్సై గౌతమ్ అక్కడికి చేరుకోగా కొద్ది సేపటికే ఆవుదూడ మృతిచెందింది. పోలీసులు సంజయ్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు వివరించారు. ఆవుదూడను చంపి అటవీ జంతువుల మాంసంగా అమ్మేందుకు ప్రయత్నం చేసినట్లు తెలిపారు. నిందితుడిపై గతంలో మేకల దొంగతనం, గుడిలో దొంగతనం, ఫారెస్ట్ కేసులు నమోదై ఉన్నట్లు పేర్కొన్నారు. ఎవరైనా ఆవులను అక్రమంగా తరలించినా, చంపినా చట్టరీత్యా నేరమని అన్నారు. ఇలాంటి వారిపై సస్పెక్ట్ షీట్ ఓపెన్ చేస్తామని హెచ్చరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఖానాపూర్: పట్టణంలోని ఖానాపూర్–తర్లపాడ్ వెళ్లే మార్గంలో మదీనా మసీద్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని విద్యానగర్ కాలనీకి చెందిన షెట్టి హిమబిందు–చంద్రశేఖర్ దంపతులు తర్లపాడ్ గ్రామంలోని ఆలయానికి వెళ్లి ఖానాపూర్‌కు తిరిగి వస్తుండగా ఖానాపూర్ నుంచి తర్లపాడ్ వైపు వెళ్తున్న లారీ వీరి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో హిమబిందు చేయి నుజ్జునుజ్జు కావడంతో పాటు చంద్రశేఖర్ తలకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే 108లో క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం నిర్మల్‌కు రిఫర్ చేశారు. లారీ డ్రైవర్ అజాగ్రత్త, నిర్లక్ష్యం కారణంగా ప్రమాదం చోటు చేసుకుందని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉత్తమ 'సేవా' పతకాలు

- ఉమ్మడి జిల్లాలో పలువురు పోలీసులు ఎంపిక

ఆదిలాబాద్‌టౌన్: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా పోలీసు శాఖలో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, సిబ్బందికి పోలీసు శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరి రవి గుప్తా ఆదివారం పతకాలను ప్రకటించారు. తెలంగాణ శౌర్య పతకం కింద రూ.10వేల నగదు, తెలంగాణ మహోన్నత సేవా పతకం కింద రూ.40వేలు, తెలంగాణ ఉత్తమ సేవా పతకం కింద రూ.30వేలు, తెలంగాణ కఠిన సేవా పతకం కింద రూ.20వేలు, తెలంగాణ సేవా పతకం కింద రూ.20వేల నగదు అందజేసి సత్కరించనున్నారు. ఉమ్మడి జిల్లాలో పలువురు మహోన్నత, ఉత్తమ సేవా, సేవా పతకాలకు ఎంపికయ్యారు.

ఇంటెలిజెన్స్..
- ఎస్.లింగారెడ్డి, ఏఎస్సై, ఆదిలాబాద్ జోన్
- పి.శ్రీధర్, హెచ్‌సీ, ఆదిలాబాద్ జోన్

మహోన్నత సేవా పతకం : రామకృష్ణ, ఆర్ఐ, 2వ బెటాలియన్ యాపల్‌గూడ

ఉత్తమ సేవా పతకం : కె.నర్సయ్య, ఎస్సై, పీసీఆర్, ఆదిలాబాద్

ఎండీ తాహెర్‌ఖాన్, హెడ్‌కానిస్టేబుల్, సోన్, నిర్మల్

జిల్లాల వారీగా సేవా పతకాలకు ఎంపికైన వారు..

ఆదిలాబాద్..
- విష్ణుప్రకాశ్, ఎస్సై, టూటౌన్
- బి.రవీందర్ రెడ్డి, హెచ్‌సీ, గుడిహత్నూర్
- ఎ.నాగేశ్వర్, పీసీ, గాదిగూడ
- కె.కిషన్, ఏఆర్ పీసీ, ఆదిలాబాద్
- ఎ.రాములు, ఏఆర్ కానిస్టేబుల్, ఆదిలాబాద్
- సీహెచ్ గోపాల్, కానిస్టేబుల్, గాదిగూడ
- డి.రమేశ్, హెచ్‌సీ, టీజీఎస్‌పీ 2వ బెటాలియన్
- జి.నర్సయ్య, హెచ్‌సీ ఈజీఎస్‌పీ, 2వ బెటాలియన్

కుమురంభీం ఆసిఫాబాద్..
- రాజేందర్ ప్రసాద్, సీఐ, కాగజ్‌నగర్
- శ్రీనివాస్, ఎస్సై, ఆసిఫాబాద్
- తిరుమల, డబ్ల్యూ ఎస్సై, భరోసా సెంటర్, ఆసిఫాబాద్
- బాలాజీ, ఏఎస్సై, కాగజ్‌నగర్
- బీహెచ్ శ్రీనివాస్, ఏఆర్ హెడ్‌క్వార్టర్స్, ఆసిఫాబాద్
- ఎండీ అజీమొద్దీన్, హెచ్‌సీ, సిర్పూర్(టి)
- షేక్ ఇమామ్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, ఆదిలాబాద్
- విశ్వజీత్, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్, ఆసిఫాబాద్

నిర్మల్..
- ఎండీ సిద్ధిఖీ హుస్సేన్, ఎస్సై, నిర్మల్
- ఎం. హనుమాండ్లు, ఏఎస్సై, నిర్మల్
- మారుతి, ఏఎస్సై, భైంసా రూరల్ పీఎస్
- అబ్దుల్ నయీమ్, ఏఆర్ ఎస్సై, దార్, నిర్మల్
- రాథోడ్ భీంరావు, ఏఎస్సై, దిలావర్‌పూర్
- రామారావు హెచ్‌సీ, డీఎస్బీ, నిర్మల్
- గంగారెడ్డి, హెచ్‌సీ, దిలావర్‌పూర్
- పెద్ద రాజన్న, హెచ్‌సీ, భైంసా
- చిన్నయ్య, హెచ్‌సీ, డీఎస్బీ, నిర్మల్
- డి.సుదర్శన్, పీసీ, తానూర్
- సూర్యవెంకటి, పీసీ, లక్ష్మణచాంద
- మాణిక్‌రావు, పీసీ, ముథోల్
- శివకుమార్, పీసీ, సోన్

మంచిర్యాల..
- డి.సురేందర్, ఏఆర్ ఎస్సై, గుడిపేట, మంచిర్యాల 13వ బెటాలియన్

క్లుప్తంగా

రికార్డు స్థాయిలో జొన్న కొనుగోళ్లు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బోథ్: కాంగ్రెస్ ప్రభుత్వంలో రికార్డు స్థాయిలో జొన్న కొనుగోళ్లను చేపట్టినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులతో కలిసి మాట్లాడారు. జిల్లాలో జొన్నల సాగు పెరగడం, దిగుబడి ఆశించిన రీతిలో రావడంతో ప్రభుత్వం ప్రతీ గింజను కొనుగోలు చేసిందన్నారు. జిల్లావ్యాప్తంగా 16 కొనుగోలు కేంద్రాల్లో 5,52,724 క్వింటాళ్ల జొన్నలను కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. జొన్నలకు సంబంధించిన డబ్బులను పది రోజుల్లో విడుదల చేయాలని ఇన్‌చార్జి మంత్రి సీతక్క ద్వారా వ్యవసాయ శాఖ మంత్రి నాగేశ్వరరావుకు విన్నవించినట్లు తెలిపారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, మాజీ మార్కెట్ చైర్మన్ గొర్ల రాజుయాదవ్, నాజర్ అహ్మద్, నాయకుడు గాజుల పోతన్న ఉన్నారు.

జొన్నల కొనుగోళ్ల గడువు పొడిగించాలి


బేలలో సీపీఐ మహాసభ ర్యాలీ

బేల: మార్క్‌ఫెడ్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న జొన్నల కొనుగోళ్ల గడువు పొడిగించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఆదివారం సీపీఐ మహాసభ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం రైతులకు రూ.2లక్షల వరకు పూర్తిస్థాయి రుణమాఫీ చేయాలని, రైతు భరోసా పెట్టుబడిని సకాలంలో అందించాలన్నారు. అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని తెలిపారు. నాయకులు వెంకటి, రాములు, సత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు పథకాలను అమలు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: భవన నిర్మాణ రంగ కార్మికులకు ప్రభుత్వం అందించాల్సిన పథకాలు సక్రమంగా అమలు చేయడం లేదని రిటైర్డ్ కార్మిక శాఖ అధికారి జగదీశ్వర్ రెడ్డి అన్నారు. ఆదివారం భవన నిర్మాణ కార్మిక సంఘ భవనంలో కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలు, హక్కుల గురించి వారికి తెలియజేశారు. రెన్యూవల్ ఒకరోజు ఆలస్యమైనా ఫలాలు అందడం లేదని, కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉండాలన్నారు. పాత పద్ధతులను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి

బజార్‌హత్నూర్: ఎస్సీ సంక్షేమ వసతి గృహంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మాజీ సర్పంచ్ పరచ సాయన్న పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఎస్సీ వసతి గృహం కార్యాలయంలో గ్రామస్తులతో కలిసి ఎస్సీ హాస్టల్ వెల్ఫేర్ వార్డెన్ బిట్ల చైతన్యను సన్మానించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించడంతోపాటు మౌలిక వసతుల కల్పనకు, విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

రోడ్డు పనులు ప్రారంభం


ప్రారంభిస్తున్న నాయకులు

బోథ్: సొనాల మండలంలోని శ్రీ రాజరాజేశ్వర ఆలయం నుంచి ప్రధాన రహదారి వరకు మొరం రోడ్డు పనులు ఆదివారం ప్రారంభమయ్యాయి. కాంగ్రెస్ నాయకులు గాజుల పోతన్న, అనిల్‌లు ఈ పనులను ప్రారంభించారు. భక్తుల సౌకర్యార్థం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్‌లు ప్రత్యేక చొరవ చూపి రోడ్డు వేయిస్తున్నారని అన్నారు. పోతన్న, దయాకర్ ఉన్నారు.

సీనియర్ జర్నలిస్టు మునీర్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

కాసిపేట: తెలంగాణ ఉద్యమ కారుడు, సీనియర్ జర్నలిస్టు మునీర్ మృతికి మండల కేంద్రంలోని కాసిపేట ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ప్రజా సంఘాలు, జర్నలిస్టుల ఆధ్వర్యంలో సంతాపం ప్రకటించి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు సిలోజు మురళి, హెచ్.రవీందర్, జర్నలిస్టులు నజీర్, లింగస్వామి తదితరులున్నారు

రైతువేదికల నిర్వహణ భారం



మేడిగూడ గ్రామంలోని రైతు వేదిక

- సొంత డబ్బులు వెచ్చిస్తున్న ఏఈవోలు
- తమ వేతనం నుంచి భరిస్తున్న వైనం

సాత్నాల: రైతులకు శాస్త్ర, సాంకేతిక విజ్ఞానం అందించే రైతు వేదికలు వ్యవసాయ విస్తరణ అధికారులు (ఏఈఓ)ల పాలిట భారంగా మారాయి. గత రెండేళ్లుగా నిర్వహణ బిల్లులు రాకపోవడంతో తమ సొంత డబ్బులతో నెట్టుకొస్తున్నామని వాపోతున్నారు. తాగునీరు, పరిశుభ్రత, మరమ్మతులతోపాటు విద్యుత్ చార్జీలు, స్టేషనరీ ఖర్చులు, శిక్షణ తరగతులు నిర్వహించిన వాటిని కలిపి దాదాపు రూ.10 వేల వరకు అవుతుందని పేర్కొంటున్నారు. వీటిని తమ వేతనం నుంచి భరించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీ నెలలో నాలుగు మంగళవారాలు ఆచార్య ఎన్జీరంగా యూనివర్సిటీ శాస్త్రవేత్తలతో వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని, హాజరైన రైతులకు తాగునీరు, టీ ఇవ్వడానికి అటెండర్లు ఉండకపోవడంతో తామే గ్రామస్తుల్లో ఒకరికి సొంత డబ్బు ఇచ్చి ఇలాంటి పనులు చేయించాల్సి వస్తుందని పేర్కొంటున్నారు. అలాగే నూతనంగా ఏర్పడిన మండలాల రైతువేదికల్లో రూ.2.20 లక్షలతో వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కల్పించారు. కానీ రైతు వేదికలకు సరైన భద్రత లేకపోవడంతో ఏ క్షణం ఏం జరుగుతుందో తెలియక భయపడుతున్నామని చెబుతున్నారు. అటెండర్ లేకపోవడంతో రైతువేదిక శుభ్రం చేయడానికి ప్రతీనెల తమ సొంత జేబు నుంచి రూ.4వేలు ఇచ్చి పరిశుభ్రంగా ఉంచుకుంటున్నామని తెలిపారు. విద్యుత్ బకాయిలు పెరిగిపోవడంతో ఏ క్షణంలో సరఫరా నిలిపివేస్తారని ఆందోళన చెందుతున్నారు.

మహిళ ఉద్యోగుల అవస్థలు

రైతు వేదికల్లో మరుగుదొడ్లు లేకపోవడంతో ముఖ్యంగా మహిళల ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని గతంలో చాలాసార్లు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం, అధికారులు, నాయకులు చొరవ తీసుకుని మరుగుదొడ్లు నిర్మించాలని మహిళా ఉద్యోగులు కోరుతున్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి



2022లో మాత్రమే ఐదు నెలలకు సంబంధించి రూ.40 వేల నిధులను ప్రభుత్వం విడుదల చేసింది. అప్పటి నుంచి ఇప్పటివరకు నెలనెలా రూ.10వేలు తమ వేతనాల నుంచి ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆర్థికంగా ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రభుత్వం పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి. – గంగారెడ్డి, ఏఈవో

మొక్కజొన్న సాగుకు ఆసక్తి


ఇచ్చోడలో ఖరీఫ్‌లో సాగైన మొక్కజొన్న(ఫైల్)

- పెట్టుబడి ఖర్చు తక్కువ
- సాగుకు రైతుల మొగ్గు
- పత్తికి ప్రత్యామ్నాయ పంట

ఇచ్చోడ: జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో మొక్కజొన్న సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. పెట్టుబడి, ఎరువులు, పురుగుల మందుల ఖర్చు తక్కువ కావడంతో ఈ పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. జిల్లాలో 15 ఏళ్ల నుంచి పత్తి తర్వాత అత్యధికంగా సోయా సాగు చేసేవారు. ఐదేళ్ల నుంచి సోయా పంటకు తెగుళ్లు సోకడంతో భారీగా దిగుబడి తగ్గింది. జిల్లాలో పత్తికి ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న సాగు చేసేందుకు అన్నదాతలు ముందుకు వస్తున్నారు. గతంలో రబీలో సాగు చేసే మొక్కజొన్నను ఈ ఖరీఫ్‌లో వేసేందుకు సిద్ధమవుతున్నారు.

పంటమార్పిడి దిశగా..

గత కొంతకాలం నుంచి పత్తి, సోయా పండించే రైతుల భూముల్లో సారం తగ్గిపోవడంతో నష్టాల పాలవుతున్నారు. దీంతో రైతులు పంట మార్పిడికి ఆసక్తి చూపుతున్నారు. ఖరీఫ్‌లో పత్తి, సోయా తర్వాత ప్రధాన పంటగా మొక్కజొన్న సాగుతో పంట మార్పిడి, లాభాలు రెండు కలిసొచ్చే అవకాశం ఉంది. దీంతో మెజార్టీ రైతులు ఈ సాగుకు ముందుకు వస్తున్నారు.

జిల్లాలో ఖరీఫ్‌లో మొక్కజొన్న సాగు

సంవత్సరం	సాగైనవి ఎకరాల్లో
2022–23	2,147
2023–24	4,520
2025–26	50,000 అంచనా

సాగు పెరిగింది

ఖరీఫ్‌లో గత రెండేళ్ల నుంచి జిల్లాలో మొక్కజొన్న సాగు పెరుగుతోంది. పంట మార్పిడికి మొక్కజొన్న సాగు చేయడం మంచిది. సోయాకు తెగుళ్ల కారణంతో దిగుబడి తగ్గింది. ప్రత్యామ్నాయ పంటగా మొక్కజొన్న సాగు చేయడానికి రైతులు ముందుకు వస్తున్నారు. – రాజశేఖర్, కేవీకే శాస్త్రవేత్త

శబరిమాత ఆలయ నిర్మాణానికి కృషి


పూజలు చేస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: శబరిమాత ఆలయ నిర్మాణానికి కృషి చేస్తానని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని శ్రీ శబరి మాత ఆలయ వార్షికోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. మండల నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రూ.5 లక్షలతో ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. అనంతరం ఆడే గజేందర్‌ను ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు. శబరిమాత భక్తులు, నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

నేరడిగొండ: సీఎం సహాయ నిధి నుంచి ఇద్దరికి ఆర్థికసాయం మంజూరైంది. మండల కేంద్రానికి చెందిన మండాజి ప్రణీత్‌కు రూ.60వేలు, కుమారి గ్రామానికి చెందిన ఎల్టీ లావణ్యకు రూ.12వేల చెక్కులను మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ ఆదివారం పంపిణీ చేశారు. బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు వసంత్ రావు, నాయకులు రాజశేఖర్‌రెడ్డి, రమేశ్, కపిల్ జాదవ్, శంకర్, బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పోతరెడ్డి, యువ నాయకుడు ఎండీ సద్దాం పాల్గొన్నారు.

షెడ్డు నిర్మాణానికి భూమిపూజ


భూమి పూజ చేస్తున్న ఆడే గజేందర్

గుడిహత్నూర్: మండల కేంద్రంలోని అతి పురాతన శివాలయం వద్ద నిర్మించనున్న షెడ్డు నిర్మాణానికి కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.4 లక్షల వ్యయంతో షెడ్డు నిర్మాణ పనులు పూర్తి చేస్తామన్నారు. మాజీ ఏఎంసీ చైర్మన్ ఆడే శీల, ఆలయ కమిటీ చైర్మన్ ధర్మపాల్ అగర్వాల్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అంకతి రవీందర్, బాలాజీ సొంటక్కె, నాగ్ నాథ్ అప్పా, ససానే మాధవ్, కరాడ్ బ్రహ్మనంద్ ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో డబ్బులు జమచేయాలి


మాట్లాడుతున్న కానిందే రాజారాం

బజార్‌హత్నూర్: రాష్ట్ర ప్రభుత్వం, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో నెలక్రితం రైతుల నుంచి కొనుగోలు చేసిన జొన్న పంట డబ్బులు వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని బీఆర్‌ఎస్ మండల కన్వీనర్ కానిందే రాజారాం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుల బతుకు అగమ్యగోచారంగా మారిందని తెలిపారు. రైతుల పంట రుణమాఫీ కాలేదని, రైతు భరోసా పెట్టుబడి సాయం అందలేదన్నారు. చివరికి పండించి అమ్ముకున్న జొన్న పంట డబ్బులు కూడా వేసే పరిస్థితి లేదని విమర్శించారు. చిల్కూరి భూమన్న, చిల్కూరి శరత్ కృష్ణ, ప్రకాశ్, జ్ఞానేశ్వర్, జనార్దన్, నగేష్ పాల్గొన్నారు.

ఇంట్లో చోరీ

ఆదిలాబాద్‌టౌన్: మావల పోలీసుస్టేషన్ పరిధిలోని న్యూహౌజింగ్ బోర్డు కాలనీలో ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఐటీసీ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్న సంతోష్ భైంసాలో విధులు నిర్వహిస్తున్నాడు. తన బంధువు ఇంటికి వెళ్లగా తాళం పగలగొట్టి ఉంది. ఈవిషయాన్ని ఆయనకు తెలియజేయడంతో ఆదివారం ఇంటికి చేరుకున్నాడు. ఇంట్లో నుంచి 7 గ్రాముల బంగారం, 250 గ్రాముల వెండి, నగదు చోరీకి గురైందని బాధితుడు ఫిర్యాదుతో ఎస్సై ప్రణయ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా బోనాల పండుగ


పూజలు చేస్తున్న భక్తులు

తలమడుగు: మండలంలోని ఉండం గ్రామ సమీపంలో పేట పోచమ్మ ఆలయంలో ఆదివారం బోనాల పండుగను నిర్వహించారు. వివిధ గ్రామాల నుంచి భక్తులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. వ్యవసాయదారులు ఏటా తమ పంట పొలాల్లో విత్తనాలు నాటే ముందు అమ్మవారికి మొక్కులు చెల్లిస్తుంటారు.

గ్రామాల్లో మిరుగు బోనాలు


పూజలు చేస్తున్న భక్తులు

భీంపూర్: మండలంలోని గ్రామాల్లోని ప్రజలు ఆదివారం మిరుగు బోనాలు సమర్పించారు. పిప్పల్‌కోటి గ్రామంలో మహిళలు నైవేద్యంతో స్థానిక పోచమ్మ ఆలయంలో చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పాడిపంటలు పండాలని మొక్కుకున్నారు. వర్షాకాలంలో అంటురోగాలు ప్రబలకుండా కాపాడాలని అమ్మవారిని వేడుకున్నారు.

రేపటి నుంచి రెవెన్యూ సదస్సులు

తలమడుగు: మండలంలోని గ్రామాల్లో ఈనెల 3 నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ రాజ్‌మోహన్ అన్నారు. 3న కోసాయి, రుయ్యాడి, 4న ఉమ్రి, అర్లి(కె), 5న దోహిగావ్, కుచులాపూర్, 6న ఖప్పర్‌దేవి, సుంకిడి, 9న ఝరి, లింగి, 10న రత్నాపూర్, ఉండం, 11న భరంపూర్, పల్సి(బి), 12న నందిగామ, పల్సి(కె), 13న మదనపూర్, కజ్జర్ల, 16న దేవాపూర్, ఖోడద్, 17న పంగిడి పిప్రి, తలమడుగు, 18న పల్లి(బి), డోర్లీ, 19న పల్లి(కె), కొత్తూరు, 20న లచంపూర్, సకినాపూర్ ఆయా గ్రామాల్లో ఈ సదస్సులు ఉంటాయని పేర్కొన్నారు. గ్రామాల వారీగా ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జరిగే సదస్సుల్లో రైతులు తమ భూ సమస్యలపై దరఖాస్తులు అందించాలని సూచించారు.

ఇచ్చోడలో..

ఇచ్చోడ: మండలంలో మంగళవారం నుంచి రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణరావు ఓ ప్రకటనలో తెలిపారు. 3న అడేగామ(కే), అడేగామ(బి), దర్మంపూరి, 4న గేర్జం, దాబా(కే), 5న కోకస్‌మన్నూర్, నర్సాపూర్, 6న మల్యాల్, గుండాల, లింగాపూర్, 9న గుబ్బ, గుండివాగు, గుండి, 10న ఇచ్చోడ, కేశవపట్నం, 11న ముఖారా(కే), మాదపూర్, 12న చింబోలి, మాన్కపూర్, 13న జల్దా, ముఖరా(బి), 16న జామిడి, సల్యాద, 17న జున్ని, సిరిచెల్మ, జోగిపేట్, 18న తలమద్రి, గాయిద్‌పెల్లి, బావోజిపెట్, 19న నవేగావ్, హీరాపూర్, 20న బోరిగామ, కామాగిరి, దాబా(బి) గ్రామాల్లో సదస్సులు ఉంటాయని పేర్కొన్నారు.

పాఠశాల పునఃప్రారంభించాలి


మూతపడి ఉన్న ప్రభుత్వ పాఠశాల భవనం

నార్నూర్: మండలంలోని కొత్తపల్లి–హెచ్ పంచాయతీ పరిధిలో దమ్మనగర్ (ఎస్సీ కాలనీ)లో ఎంపీపీఎస్ ప్రభుత్వ పాఠశాల మూతపడింది. విద్యార్థులు లేరనే కారణంతో 11 ఏళ్ల క్రితం విద్యాశాఖ అధికారులు తప్పుడు నివేదికతో మూసివేయించారు. అప్పటికి విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి విద్యార్థుల సంఖ్యతోపాటు సమస్య వివరించినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం గ్రామంలో 30 మంది చిన్నారులు ఉన్నారు. నిరుపేద దళిత కుటుంబాలు కావడంతో ప్రైవేట్ బడిలో చదివించుకోలేక 2 కి.మీ దూరంలో కొత్తపల్లి హెచ్ తండాలోని ప్రభుత్వ పాఠశాలకు పంపిస్తున్నారు. ప్రతీరోజు కాలినడకన వెళ్లి వస్తున్నారు. 30 మంది విద్యార్థులు ఉన్నందున పాఠశాలను పునఃప్రారంభించాలని విద్యాశాఖ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా ప ట్టించుకునేనాథుడే కరవయ్యారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ స్పందించి కొత్తపల్లి–హెచ్ (దమ్మ నగర్) ఎస్సీ కాలనీ ప్రభుత్వ పాఠశాలను పునః ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. కాగా, ఎంఈవో పవార్ అనిత వివరణ కోరగా, పాఠశాల పునఃప్రారంభించాలని గ్రామస్తులు వినతిపత్రం అందజేసిన మాట వాస్తవమన్నారు. ఉన్నతాధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లామన్నారు. వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామన్నారు. అప్పటివరకు పక్కా గ్రామంలో ఉన్న పాఠశాలలో చేర్పించాలన్నారు.

రెండు నెలలవేతనాలు విడుదల

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ ఆ సుపత్రుల్లో విధులు నిర్వర్తి స్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు గత నాలుగు నెలలుగా వేతనాలు అందక ఇబ్బంది పడుతు న్న తీరును గతనెల 19న సాక్షిలో 'వేతనాలు లేక ఔట్ సోర్సింగ్ వెతలు'కథ నం ప్రచురితమైంది. దీనికి స్పందించిన వైద్యారోగ్య శాఖ కమిషనర్.. రెండు నెలల వేతనాలు విడుదల చేశారు. సమస్య పరిష్కారానికి సహకరించిన 'సాక్షి'కి ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కృతజ్ఞతలు తెలియజేసింది.

సాక్షి ఎఫెక్ట్..

మురుగుకాలువలు శుభ్రం

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలోని పాత ఉట్నూర్‌లో పారిశుద్ధ్యం లోపించి ఇబ్బందిపడుతున్న కాలనీ వాసుల గురించి ఆదివారం సాక్షిలో 'అధ్వానంగా డ్రెయినేజీ'కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన పంచాయతీ అధికారులు.. మురుగుకాల్వలను కార్మికులతో శుభ్రం చేయించారు.


శుభ్రం చేస్తున్న కార్మికులు

గోవులు అక్రమ రవాణా చేస్తే చర్యలు


పట్టుబడ్డ నిందితులు

సాత్నాల: గోవులను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని జైనథ్ సీఐ సాయినాథ్ అన్నారు. ఎస్పీ ఆదేశాల మేరకు భోరజ్ మండలంలోని పిప్పర్వాడ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద ఆదివారం తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వ్యక్తులు కనిపించారు. వెంటనే వారిని విచారించగా మహారాష్ట్రలోని బోరి నుంచి ఆదిలాబాద్‌కు గోవులను అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిపారు. బక్రీద్ కోసం గోవధ చేయడానికి తీసుకెళ్తున్నట్టు తెలిసిందన్నారు. పట్టుకున్న గోవులను గోశాలకు తరలించారు. గెడం సుభాష్, రాంకిషన్, దిలీప్‌లను వివరాలు అడగగా, రోజు కూలీలమని, షేక్ జమ్ము, షేక్ నజీర్ హసన్‌లు చెప్పటంతో వాటిని తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.



బజార్‌హత్నూర్: మండల కేంద్రంలోని జెడ్పీ సెకండరీ పాఠశాలలో 1998-99 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు కలుసుకున్నారు. మండల కేంద్రంలో ఆదివారం అపూర్వ సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు ఒకరికొకరు ఆత్మీయ ఆలింగనం అనంతరం యోగాక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి గుర్తులను నెమరువేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

పడకేసిన పారిశుద్ధ్యం

జైనథ్: మండల కేంద్రంలో పారిశుద్ధ్యం పడకేసింది. చెత్త ఎక్కడపడితే అక్కడ, డ్రెయినేజీల్లో చెత్తాచెదారం నిండి దుర్వాసన వస్తోంది. దీంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.